సాక్షి వనపర్తి

బుధవారం । 5 । జూలై । 2023



నిర్లక్ష్యమే శాపం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

వివరాలు 8లో ▸



వార్షిక పురస్కారాలు

ఉత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు ఆర్టీసీ ప్రగతి చక్రం పురస్కారాలు అందించింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /23.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు 2023–24 పురస్కారాలకుగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ నెల 15లోగా పూర్తి వివరాలతో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

టీసీసీ ధ్రువీకరణ పత్రాలు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) మెమోలు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఉన్నాయని.. ఉత్తీర్ణులైన వారు తీసుకెళ్లాలని డీఈఓ గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ఏదుల రిజర్వాయర్ సందర్శన



గోపాల్‌పేట: మండలంలోని ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్‌ను మంగళవారం వనపర్తి స్వర్ణకార, బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు 200 మంది సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం అద్భుతంగా ఉందని.. పూర్తయితే తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. త్వరలోనే డ్రైరన్ ఉన్నందున సందర్శించినట్లు వివరించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మదనాపురం: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఐద్వా జిల్లా సహాయ కారదర్శి గద్వాల సాయిలీలా కోరారు. మంగళవారం మండలంలోని అజ్జకొల్లులో ఉపాధిహామీ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో గుడారాలు, మెడికల్ కిట్లు, తాగునీరు లేవని.. కూలి డబ్బులు సరిగా అందడం లేదని, రూ.272 కూలికిగాను రూ.70 మాత్రమే చెల్లిస్తున్నారని కూలీలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రతి ఏటా ఉపాధిహామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించి నిర్వీర్యం చేస్తోందని.. వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.



‘నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి మండలం రాయిపాకులకు చెందిన రైతు ఆలేటి లక్ష్మయ్య తనకున్న రెండు ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాడు. విత్తనాలు వేసి పదిరోజులు గడుస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో పంటను కాపాడుకునేందుకు నిత్యం స్ప్రింక్లర్లతో తడపాల్సి వస్తోందని రైతు లక్ష్మయ్య వాపోతున్నాడు. అయినప్పటికీ సగం మేరకు **విత్తనాలు మాత్రమే మొలకెత్తాయని చెబుతున్నాడు.**



‘జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రానికి చెందిన రైతు గోవిందమ్మ తనకున్న నాలుగు ఎకరాల్లో పత్తిపంటను సాగుచేస్తోంది. గత 20 రోజుల కింద పత్తి విత్తనాలను నాటింది. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే చేనులోని మొలకలు ఎండిపోయాయి. పత్తి సాగు కోసం ఇప్పటికే రూ.40 వేల వరకు ఖర్చయిందని, ఈసారి ఆరంభంలోనే నష్టపోవాల్సి వస్తోందని ఆమె ఆందోళన చెందుతోంది.’

సాగు వెనుకంజ

- **ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సాగు 15 శాతమే..**
- **ఇప్పటికే నెలరోజులు పూర్తయిన వానాకాలం సీజన్**
- **సరిపడా వర్షాలు లేక పత్తిసాగుపై ఆశలు వదులుకున్న రైతులు**
- **వరి, వేరుశనగ పంటలపైనే అన్నదాతల ఆశలు**
- **వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అత్యల్ప వర్షపాతం**



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం రాయిపాకులలో స్ప్రింక్లర్లతో పత్తిపంటను తడుపుతున్న రైతు

సాక్షి, నాగర్‌కర్నూల్: వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు పంటల సాగు సగానికి పైగా పూర్తి కావాల్సి ఉండగా.. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా సరైన వర్షపాతం లేకపోవడంతో పంటల సాగు 15 శాతం కూడా మించడం లేదు. ఈసారి సీజన్‌లో వర్షాలు ఆలస్యం కావడం, ఇప్పటి వరకు సరైన వర్షపాతం లేని కారణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పత్తి సాగు గణనీయంగా తగ్గింది. మరోవైపు వరిపంట వేసేందుకు ఇప్పటికే నార్లు పోసుకోవాల్సి ఉండగా.. వర్షాలు, సాగునీటి కోసం ఎదురుచూపులతోనే రైతులు కాలం గడిచిపోతోంది.

వర్షాల ఆలస్యంతో..

ఈసారి వానాకాలం సీజన్ మొదలై నెల రోజులు గడిచినా సరైన వర్షాలు లేకపోవడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు. దీంతో ఈసారి సాగు అంచనాలో కనీసం 15 శాతం కూడా రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. ఇప్పటికే పత్తి విత్తనాలు వేసి తామంతా తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఈపాటికే పత్తి విత్తనాలు వేసి కలుపు కూడా తీసుకునేవాళ్లమని రైతులు చెబుతున్నారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో పత్తి వేయలేకపోయామని, ఇప్పుడు వేస్తే చీడపీడల బారిన పడటం తప్ప ఫలితం ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం పత్తిసాగుకు ఇంకా జూలై 15 వరకు సమయం ఉందని, సరిపడా వర్షాలు పడ్డాకే విత్తనాలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

కనిపించని చినుకు జాడ..

ఏటా జూన్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కనీసం 81 నుంచి 93 మి.మీ., మేరకు సగటు వర్షపాతం నమోదయ్యేది. ఈసారి మాత్రం ఎక్కడా 71 మి.మీ., మించలేదు. వనపర్తిలో జూన్‌లో సాధారణ వర్షపాతం 86.6 మి.మీ కాగా.. 53.3 మి.మీ., నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటికే సుమారు 90.2 మి.మీ.,కు గాను.. కేవలం 60.7 మి.మీ., మాత్రమే వర్షపాతం నమోదైంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటల సాగు వివరాలు

జిల్లా	సాగు అంచనా	ఇప్పటివరకు సాగైంది	సాధారణ వర్షపాతం	ఇప్పటివరకు కురిసింది (జూన్‌లో మి.మీ)
మహబూబ్‌నగర్	3,77,917	49,575	93.4	67.9
నాగర్‌కర్నూల్	4,86,000	78,561	85.8	69.4
వనపర్తి	2,25,990	2,115	86.6	53.3
జోగుళాంబ గద్వాల	3,42,429	25,541	81.1	70.3
నారాయణపేట	4,12,820	1,51,250	90.2	60.7

వనపర్తిలో తక్కువ.. నాగర్‌కర్నూల్‌లో ఎక్కువ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం ఈసారి మందగించింది. వనపర్తి జిల్లాలో మొత్తం 2,25,900 ఎకరాల్లో సాగు ఉంటుందని అంచనా వేయగా.. ఇప్పటి వరకు కేవలం 2,115 ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తి, వరి పంటలు సాగుచేశారు.

- నాగర్‌కర్నూల్ జిల్లాలో 4.86 లక్షల ఎకరాలకు గాను ఇప్పటి వరకు 78,561 ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేశారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం 3,40,498 ఎకరాల్లో పంటల సాగు ఉంటుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటివరకు కేవలం 28,151 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇందులో 27,151 ఎకరాల్లో పత్తి, 144 ఎకరాల్లో కంది, 65 ఎకరాల్లో వేరుశనగ, పది ఎకరాల్లో సోయాబీన్ పంటలను సాగుచేశారు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 3,77,917 ఎకరాలకు గాను 49,575 ఎకరాల్లో ఇప్పటివరకు సాగైంది.
- నారాయణపేట జిల్లాలో 4,12,820 ఎ కరాల సాగు అంచనా ఉండగా.. 1.51 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

మొత్తం ఎండిపోయింది



నేను ఈసారి రెండు ఎకరాల్లో పత్తిపంట వేశాను. మొలకలు ఎదగాల్సిన సమయం**లో వర్షాలు పడలేదు. ఎక్కడికక్కడ మొలకలు ఎండిపోయి చేసిన కష్టమంతా వృథా అయింది. విత్తనాలు, కూలీల ఖర్చుతో ఇప్పటికే రూ.20 వేల వరకు నష్టపోయా. పంట మళ్లీ వేయాలంటే ఇంకా ఖర్చు పెరుగుతోంది.**

– నాగరాజు, రైతు, ఉండవెల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా

తుకం పోయలేదు..



ఏటా ఈసమయానికి వరి పంట కోసం తుకం పోసుకునే వాళ్లం. నేను ప్రతిసారి 8 ఎకరాల్లో వరిపంటను వేస్తుండగా ఈసారి మాత్రం వర్షాలు లేక తుకం కూడా పోయలేదు. కేఎల్ఐ ద్వారా నీరందించినా నార్లు పోసుకునేవాళ్లం. కాల్వ నీళ్లు సైతం లేకపోవడంతో వర్షాల కోసమే ఎదురు చూడాల్సివస్తోంది.

– శేఖర్, రైతు, గోపాల్‌పేట, వనపర్తి

వర్షం పడ్డాకే వేసుకోవాలి..



రైతులు సరిపడా వర్షం పడ్డాకే పత్తి విత్తనాలు వేసుకోవాలి. పత్తిసాగుకు కనీసం 6 సె.మీ., వర్షపాతం అవసరం. పత్తి సాగుకు ఇంకా జూలై 15 వరకు సమయం ఉంది. నీటి వసతి ఉన్నవారు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసుకోవచ్చు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షపాత సూచనలు కనిపిస్తున్నాయి. రైతులు గమనించి వర్షం పడ్డాకే పత్తి విత్తుకోవాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, నాగర్‌కర్నూల్

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి



ఆపరేషన్ ముస్కాన్ జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొనన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు

వనపర్తి: 2022–23 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ లక్ష్యం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్‌మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులతో సీఎంఆర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిల్లర్లు సామర్థ్యం మేరకు వరి ధాన్యాన్ని మర ఆడించి సకాలంలో బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాలన్నారు. ప్రతి సీజన్‌లో జాప్యం ఎందుకు జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి మిల్లులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని.. సకాలంలో బియ్యం అందించని మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైస్‌మిల్లర్లు 15 రోజుల్లో మిల్లులను ప్రారంభించాలని సూచించారు. మిల్లింగ్ ప్రారంభించని మిల్లులపై టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి..

బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని.. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి నుంచి పారిపోయిన, తప్పిపోయిన, ఇతరులు ఎత్తుకెళ్లిన పిల్లలతో పాటు బాలకార్మికులు, వివక్షకు గురైన 18 ఏళ్లలోపు బాలలను స్పెషల్ డ్రైవ్‌లో చేరదీయాల్సిన అవసరం ఉందన్నారు. బడిఈడు ఉన్న ప్రతి ఒక్కరూ పాఠశాలలో చదువుకోవాలని.. బలవంతంగా వారితో పనులు చేయిస్తే యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ బృందం గ్రామ, మండలస్థాయి అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. బృందానికి తహసీల్దార్లు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నుంచి డీపీఓ వరకు పూర్తి సహకారాలు అందిస్తారన్నారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా గుర్తించిన యజమానులపై నిబంధనల ప్రకారం కార్మిక, పోలీసుశాఖ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంమహేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్, డీఈఓ గోవిందరాజులు, బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు అలివేలమ్మ, డీసీపీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అప్పగింతలో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

రిక్త హస్తమేనా?

రద్దయిన అభయహస్తం పథకం

- నేటికీ అందని ప్రీమియం డబ్బులు
- జిల్లాలో సుమారు 29 వేల మంది సభ్యులు
- వడ్డీతో చెల్లించాలని కోరుతున్న మహిళలు



దంతనూరులో పింఛన్ కోసం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కూర్చున్న మహిళలు (ఫైల్)

మదనాపురం: వంటింటికే పరిమితమైన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలు ఒక్కో అడుగు ముందుకేస్తూ బ్యాంకు లింకేజీ, శ్రీనిధి తదితర రుణాలు పొందుతూ స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇందులో భాగంగానే 2000 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంఘాల మహిళల కోసం ఎల్ఐసీ అనుసంధానంతో అభయహస్తం పథకాన్ని ప్రారంభించారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలంతా ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించారు. సభ్యులు 59 ఏళ్లు వచ్చే వరకు ఏడాదికి రూ.365 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం అంత నగదు జమచేసేది. 60 ఏళ్లు నిండిన తర్వాత వారు జీవించినంత కాలం నెలకు రూ.500 పింఛన్ చొప్పున అందించాలని నిర్ణయించారు. అలాగే సంఘంలో సభ్యత్వం ఉండి 60 ఏళ్లు దాటిన మహిళలు ఒకేసారి రూ.3,600 చెల్లించి పథకంలో చేరే అవకాశం కల్పించారు. వీరికి తర్వాతి నెల నుంచే రూ.500 పింఛన్ అందించాలని ఆదేశాలిచ్చారు. పథకంలో చేరిన అందరికి అభయహస్తం బాండ్లు సైతం అందజేశారు. వీటితోపాటు ఎన్నో ప్రయోజనాలు కల్పించింది. అలాగే పింఛన్ తీసుకున్న మహిళ చనిపోతే ఆమె చెల్లించిన మొత్తం తిరిగి కుటుంబానికి చెల్లించేలా రూపొందించారు. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేసి అభయహస్తం పథకాన్ని రద్దుచేసింది. ఈ పథకంలో చేరి డబ్బులు జమ చేసిన వారికి తిరిగి చెల్లిస్తామని ప్రకటించినా.. నేటికీ అందకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 85,877 మంది మహిళా సంఘాల సభ్యులు ఉండగా.. ఇందులో అభయహస్తం పథకంలో చేరిన మహిళలు సుమారు 29 వేల మంది, 60 ఏళ్లు నిండి రూ.3,600 ఒకే మొత్తంలో చెల్లించిన మహిళలు 2,018 మంది ఉన్నారు. 60 ఏళ్ల వయసు నిండిన వారికి కొన్ని నెలల పాటు పింఛన్ కూడా వారి ఖాతాల్లో జమచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత అభయహస్తం పథకం నిలిపివేయడంతో పథకంలో చేరిన మహిళలు డబ్బులు బ్యాంకుల్లో జమచేసే ప్రక్రియ నిలిచిపోయింది. సేకరించిన డబ్బులను తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి వారి వివరాలను సేకరించాలని డీఆర్డీఓ అధికారులను ఆదేశించింది. బాండ్లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు సెల్‌నంబర్లు సైతం లబ్ధిదారుల నుంచి సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. అయినా నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు మాత్రం జమ కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రీమియం డబ్బులు తిరిగి చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

ఆశగా ఎదురుచూస్తున్నాం..



నేను అభయహస్తం పథకంలో చేరి ఆరేళ్లపాటు ప్రీమియం డబ్బులు చెల్లించాను. పథకం రద్దు కావడంతో తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే చాలా సమయమైంది.. వడ్డీతో కలిపి చెల్లించాలి.

– భాగ్యలక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు, మదనాపురం

ప్రీమియం డబ్బులు చెల్లించాలి..



ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని నిలిపివేసింది. బ్యాంకులో జమచేసిన ప్రీమియం డబ్బులు ప్రభుత్వం తక్షణమే తిరిగి చెల్లించాలని కోరుతున్నాం. ప్రతి సమావేశంలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.

– భాగ్యమ్మ, అధ్యక్షురాలు, జిల్లా మహిళా సమైఖ్య

బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం..

అభయహస్తం పథకంలో చేరిన మహిళలకు ప్రభుత్వం త్వరలోనే ప్రీమియం డబ్బులు తిరిగి చెల్లిస్తుంది. మహిళలు చెల్లించిన మొత్తం వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– నర్సింహులు, డీఆర్డీఓ

దొడ్డి కొమురయ్య జీవితం ఆదర్శం

జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్ తదితరులు

వనపర్తి: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య జీవితం నేటితరానికి ఆదర్శప్రాయమని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమానికి ఆయనతో పాటు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ముఖ్యఅతిథిగా హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట యోధులను స్మరించుకొని వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, భుక్తి, బానిస బతుకుల విముక్తి కోసం నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పోరాడి 1946, జూలై 4న తూటాలకు బలైన కొమురయ్య చరిత్రను ప్రస్తుత తెలంగాణ సమాజం తెలుసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ.. మహనీయులు ఒక జాతికి, కులానికి పరిమితం కాదని, సమ సమాజం నిర్మాణానికి పాటుపడిన వారిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దొడ్డి కొమురయ్య పటేల్, పట్వారీ, జమిందారీలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. తమ భూమి తమకే చెందాలని అందులో పండించిన పంటకు తామే హక్కుదారులమని పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారని, ఆయన స్ఫూర్తిగా చాకలి ఐలమ్మ లాంటి వారు సాయుధ పోరాటానికి సిద్ధమయ్యారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్, బీసీడీఓ సుబ్బారెడ్డి, సీపీఓ వెంకటరమణ, డీఆర్డీఓ నర్సింహులు, డీఎస్‌సీడీఓ నుషిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మత్స్యశాఖ అధికారి రహమాన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: జిల్లాకేంద్రంలోని బీసీ స్టడీసర్కిల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా ఉంటుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసి 18 నుంచి 33 ఏళ్లలోపు యువత అర్హులని.. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి కర్నూలు, గద్వాలలోని వివిధ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

- ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి
- డయల్ 100 కాల్స్‌పై తక్షణ స్పందన అవసరం
- ఎస్పీ రక్షిత కె.మూర్తి



ఎస్ఐ రవిప్రకాష్‌తో మాట్లాడుతున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

పాన్‌గల్: ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వినతులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ రవిప్రకాష్ స్టేషన్‌కు సంబంధించిన పలు విషయాలను ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది విధులను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని.. చట్టాలను ముందుగా స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలువాలని కోరారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సాంకేతికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ నిరంతర గస్తీ నిర్వహించాలని, డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలకు అన్నిరకాల నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.

బీడీ కార్మికులకు పీఎఫ్ కార్డులు : ఇఫ్టూ

అమరచింత: బీడీ కార్మికులందరికి పీఎఫ్ కార్డులు ఇవ్వాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని చందూల్ బీడీ ఫ్యాక్టరీలో కార్మికులకు మంజూరైన పీఎఫ్ కార్డులు ఫ్యాక్టరీ మేనేజర్ జుబేర్ అహ్మద్ సమక్షంలో పంపిణీ చేసి మాట్లాడారు. యాజమాన్యం కూడా ప్రతినెల కార్మికుడి ఖాతాలో పీఎఫ్ నిధి జమ చేయాలని కోరారు. చందూల్ బీడీ ఫ్యాక్టరీ నుంచి 60 మందికి పీఎఫ్ కార్డులు అందాల్సి ఉండగా.. ప్రస్తుతం 28 మందికి అందజేశామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అందించాలని ఫ్యాక్టరీ మేనేజర్‌కు సూచించారు. పీఎఫ్ కార్డుల కోసం యాజమాన్యంతో నిరంతరం పోరాటం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, రాజు, ప్రేమరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

దామరగిద్ద: చేపల వేటకు వెళ్లిన ముగ్గురిలో ఓ వ్యక్తి చెరువులో దిగి చేపల వలకు చిక్కుకుని మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ రావ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని క్యాతన్‌పల్లి ఊరుచెరువులో అదే గ్రామానికి చెందిన తిరికి తిప్పణ్న(58)తో పాటు భీమప్ప, నర్సప్పలు సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేపల వేటకు వెళ్లారు. కాగా తిప్పణ్న చెరువు లోపలికి వెళ్లి చేపల కోసం వేసిన వలకు చిక్కుకుని నీటిలో మునిగిపోయాడు. తోటి వ్యక్తులు కాపాడేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో వ్యక్తి నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెతికినా.. అచూకి లభించలేదు. దీంతో మంగళవారం పోలీసుల సమక్షంలో గజఈతగాళ్లను పిలిపించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

అకస్మాతుగా కిందపడి మహిళ..

నాగర్‌కర్నూల్ క్రైం: అకస్మాతుగా మహిళ కిందపడి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని మైల చిన్నమ్మ (55) వ్యక్తిగత పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తుండగా.. బస్టాండ్ సమీపంలో అకస్మాతుగా కిందపడి మృతిచెందింది. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

రాజోళి: మద్యానికి బానిసైన యువకుడిని తల్లి మందలించడంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోళికి చెందిన హుస్సేనమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన సాయి తేజ(21) మద్యానికి అలవాటు పడ్డాడు. పనులు చేసుకోకుండా మద్యం తాగడంతో జీవితం నాశనమవుతుందని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతిచెందాడు. అతని సోదరుడు లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సీహెచ్ కుర్మయ్య తెలియజేశారు.

వివాహిత బలవన్మరణం

అమరచింత: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా.. మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన పద్మ(35) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో ఎన్ని ఆస్పత్రులకు చూపించినా తక్కువ కాకపోవడం, సోమవారం రాత్రి మరోసారి తీవ్రమైన నొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై పద్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో గొడవ పెట్టుకుని ఓ వ్యక్తిపై దాడి చేసిన అయిదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని రుక్కన్నపల్లికి చెందిన పెంకుల నరేష్, అదే గ్రామానికి చెందిన మాసయ్య, రాధ, వీరయ్య, సతీష్, గణేష్‌లు కుటుంబ విషయాల్లో గొడవ పెట్టుకున్నారు. మంగళవారం ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. గొడవ పెద్దగా కావడంతో దాడి చేసుకున్నారు. ఈ విషయమై మంగళవారం తనను గ్రామానికి చెందిన మాసయ్య, రాధ, వీరయ్య, సతీష్, గణేష్ దాడిచేశారని నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నిర్లక్ష్యమే వారికి శాపం

- అంధకారంలోకి ఉమ్మడి గండేడ్ మండలం పలుగ్రామాలు
- పునరుద్ధరించని విద్యుత్ అధికారులు

చినుకు పడిందంటే చాలు ఆ గ్రామాల్లోని ఇళ్లలో పగలు కూడా చీకటి అలుముకుంటుంది. పదేళ్లుగా అవస్థలు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ఉమ్మడి గండేడ్ మండలంలోని పలుగ్రామాలు నిత్యం గంటల తరబడి అంధకారంలో మగ్గాల్సి వస్తోంది. దాదాపు 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్‌లైను వైర్లు, ఇన్సులేటర్లు పాతబడ్డాయి. నిత్యం మరమ్మతు చేస్తూ అతుకులబొంతగా మారినా సంబంధిత అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



ఉమ్మడి మండల గ్రామాలకు సరఫరా చేసే విద్యుత్ సబ్‌స్టేషన్



పుట్టాపహాడ్ నుంచి సరఫరా చేసే 11కేవీ లైన్‌కు తగులుతున్న చెట్లు

మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు కూతవేటు దూరంలో కుల్కచెర్ల మండలం పుట్టాపహాడ్ గ్రామంలో 133కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. అక్కడి నుంచి గండేడ్ మండలం రుసుంపల్లి, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, సాలార్‌నగర్, వడ్డెగుడిసేలు, మహమ్మదాబాద్ మండలంలోని గాదిర్యాల్, జగ్గంపల్లి, బోయగుడిసెలు, ఎన్కిచెరువుతాండ, గువ్వోనికుంటతాండ, బోరింగ్, మదిరెమీది తాండాల గ్రామాలకు, వ్యవసాయానికి పుట్టాపహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ గ్రామాలకు గతంలో 55సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఐరన్ స్తంభాలు ఉన్నాయి. లూప్ ఎక్కువ కావడంతో పదేళ్ల క్రితం మధ్యమధ్యలో కొత్త స్తంభాలు పాతారు. పాతవైర్లనే ఉంచి, పగిలిన ఇన్సులేటర్లనే సరిచేసి చేతులు దులుపుకున్నారు. అనంతరం విద్యుత్ పునరుద్ధరణ ప్రత్యేక కార్యక్రమాలు మండలంలో చేపట్టినా ఈ గ్రామాల్లో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో లూప్‌లైన్, చెట్లకు తాకడం వంటి సమస్య ఎక్కువగా ఏర్పడుతోంది. దీనివల్ల కరెంట్ సరఫరా గంటల తరబడి నిలిచిపోతోంది. గాలివాన వచ్చిందంటే చాలు, వైర్లు తెగాయని, ఫీజులు పోయాయని కారణం చెబుతూ విద్యుత్ సిబ్బంది కరెంట్ కట్ చేస్తున్నారని ఆయా గ్రామాలప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అంతరాయానికి కారణమవుతున్న 11కేవీ విద్యుత్ లైను కిందే చెట్లల్లో ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్

రోజూ కరెంట్ తీస్తున్నారు..



మా గ్రామానికి కూతవేటు దూరంలో 133కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా లాభం లేదు. గాలివాన వచ్చి, చినుకు పడిందంటే చాలు వెంటనే కరెంట్ తీసేస్తారు. వైర్లు తెగాయంటూ, చెట్లు విరిగిపడ్డాయంటూ, ఫీజులు ఎగిరాయంటూ గంటల తరబడి కరెంటు రాక అవస్థలు పడాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విద్యుత్‌లైన్‌ను పునరుద్ధరించాలి.

– రాఘవేందర్‌రెడ్డి, గాధిర్యాల్

తుప్పపట్టిన లైన్..



పుట్టాపహాడ్ నుంచి 50 ఏళ్ల కిత్రం ఏర్పాటు చేసిన విద్యుత్‌లైను వైర్లు, ఇన్సులేటర్లు తుప్పుపట్టాయి. తెగినా, పడినా, పగిలిపోయినా అతుకులు వేస్తున్నారు. సమస్య పరిష్కారం గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా 11కేవీ లైన్‌ను వెంటనే మార్చాలి. 12గ్రామాల సమస్యను తీర్చాలి.

– బుర్జుకాడి ఆంజనేయులు, రుసుంపల్లి

నివేదిక పంపిస్తాం..

పుట్టాపహాడ్ నుంచి ఉమ్మడి గండేడ్ మండలంలోని ఆయా గ్రామాలకు విద్యుత్ లైన్ సమస్యలున్న విషయం మాదృష్టికి వచ్చింది. ఆయా గ్రామ పంచాయతీల నిర్ణయంతో లైన్ సర్వేచేసి, ఎస్టిమేషన్ చేసి, మార్చేందుకు త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజల సమస్యలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– సంజీవరెడ్డి, డీఈ, నారాయణపేట

వలస జీవులు.. ఆగమయ్యారు

- తాపీమేస్త్రి పనులకు వెళ్లి మృత్యుఒడిలోకి
- కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన కుమారులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి



అంజనాయక్ (ఫైల్)

వెల్దండ: మేము ఎలాగో చదువుకోలేదు.. మా పిల్లలన్నైనా ఉన్నతంగా చదివించి ఉన్నత శిఖరాలకు చేర్చాలనుకున్నారు ఆ భార్యాభర్తలు. రంగారెడ్డిలో తాపీమేస్త్రి పనులు చేసుకుంటూ కుమారులను చదివించుకుంటున్నారు. విధివక్రించి వారి బతుకులను చిన్నాభిన్నం చేశాయి. ఆ తాపీమేస్త్రి పనే ఇంటి పెద్ద దిక్కును కోల్పోయేలా చేసింది. భార్య కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

వెల్దండ మండలం తుమ్మలకుంట తండాకు చెందిన రామావత్ అంజనాయక్, భారతి భార్యాభర్తలు. వీరు రంగారెడ్డి జిల్లా తుక్కుగూడకు వలస వెళ్లి తాపిమేస్త్రి పనులు చేసుకుంటున్నారు. ఆదివారం పనుల వద్ద స్లాబ్ కూలి భర్త మృతిచెందగా.. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. చికిత్సలో భాగంగా ఆమె రెండు కాళ్లను తీసివేశారు. భార్యకి కనీసం భర్త మృతిచెందిన విషయం తెలియకుండా చివరి చూపునకు నోచుకోక ఆమె హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతుంది. భర్త మృతదేహానికి అన్నదమ్ములతో పాటు కుమారులు, గ్రామస్తులతో అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించడంతో తండా వాసులు కన్నీరుమున్నీరు పెట్టుకున్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన అజయ్, లోక్య చిన్నారులు కంటతడి పెట్టుకున్నారు. అజయ్ మహేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, లోక్య మైసిగండిలో 10వ తరగతి ఎస్టీ గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారు. వారి చదువును కొనసాగించాలా? లేక చావు బతుకులోని తల్లిని కాపాడుకోవడానికి పనులకు వెళ్లాలో దిక్కుతోచని స్థితిలో చిన్నారులు ఉన్నారని తండావాసులు విలపిస్తున్నారు.



హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న భారతి



తుమ్మల కుంటతండాలో దిక్కుతోచని స్థితిలో పిల్లలు

ఆ కార్యాలయంలో ఆయనదే హవా

- అన్ని వ్యవహారాలు చక్కదిద్దుతున్న ప్రైవేట్ సిబ్బంది

జడ్చర్ల: మండల స్థాయిలో అది ఓ ప్రభుత్వ ప్రధాన కార్యాలయం. అయితే ఆ కార్యాలయంలో ఓ వ్యవస్థకు సంబంధించి నియమించిన ప్రైవేట్ సిబ్బందిదే పైచేయి. ఆయన ఎంత చెబితే అంతే. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రైవేట్‌గా నియామకం చేసుకున్న ఓ వ్యక్తి చేయి తడపనిదే ఏ పని ముందుకు సాగడం లేదు. దీంతో వివిధ రకాల పనుల నిమిత్తం, సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంఘటనలకు బాలానగర్ మండల తహసీల్దార్ కార్యాలయం వేదికగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి దందా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా సాగుతుంది. ధరణి రాకతో ఈ తతంగం అంతా ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా మారింది. కార్యాలయంలో పనిచేసే ఓ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ అంతా తానై వ్యవహరిస్తున్నాడు. మండలంలోని ఏ గ్రామ శివారులో వెంచర్ ఏర్పాటు చేయడానికి సంబంధించిన భూముల వ్యవహారాలను చక్కదిద్దాలంటే రియల్ వ్యాపారులు సదరు ఆపరేటర్ ద్వారానే నడిచే పరిస్థితి నెలకొంది. నాలా ఇతర అవసరమైన అన్ని వ్యవహారాలను తానే చూసుకుంటాడనే నమ్మకం ఉండడంతో అటు రియల్ వ్యాపారులకు.. ఇటు అధికారులకు తలలో నాలికలా వ్యవహరిస్తున్నాడన్న పేరుంది. అతనిని కాదని పనులు చేసుకోవాలంటే కొర్రీలు పెట్టి ఇబ్బందులు సృష్టించే పరిస్థితి కల్పిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవ కార్యాలయాల్లో, ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకుంటే వారి సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారం కావడం లేదని ఎంతో కొంత డబ్బులు ఎక్కువైనా తహసీల్దార్ కార్యాలయంలో పనులు చేసే ప్రైవేట్ వ్యక్తుల ద్వారానే త్వరితగతిన పరిష్కారం అవుతుందనే భావన ప్రజల్లో నెలకొంది. ఈ వ్యవహారంపై 'సాక్షి' తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గతంలో ఓ వ్యక్తి ఆపరేటర్‌గా పనిచేశారని, కొందరు వ్యక్తుల నుంచి వచ్చిన ఆరోపణలతో అతన్ని తొలగించామని చెప్పారు.

పోర్టల్ అనుసంధానంపై ముమ్మర ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంఈ వాణి

- వైద్య కళాశాల, ఆస్పత్రిని తనిఖీ చేసిన ఇన్‌చార్జ్ డీఎంఈ వాణి

పాలమూరు: మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలతో పాటు జనరల్ ఆస్పత్రిని మంగళవారం ఇన్‌చార్జ్ డీఎంఈ డాక్టర్ వాణి, ఎన్ఎంసీ రాష్ట్ర కోఆర్డినేటర్ విమల థామస్ సందర్శించారు. ఇటీవల పాలమూరు మెడికల్ కళాశాలకు సంబంధించిన 2018 ఎంబీబీఎస్ బ్యాచ్ గుర్తింపు రద్దు చేసిన క్రమంలో వీరి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో కళాశాల, ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరు తెలుసుకునే కార్యక్రమం బిజీ షెడ్యూల్ వల్ల వాయిదా పడింది. కళాశాలలో 12, ఆస్పత్రిలో 13 సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్ చేయడంతోపాటు వాటిని జాతీయ మెడికల్ కౌన్సిల్ పోర్టల్‌కు అనుసంధానం చేయాల్సి ఉంది. మెడికల్ కళాశాలలో పూర్తయిన ఆస్పత్రిలో టెక్నికల్ సమస్య వల్ల పూర్తికాలేదు. దీనిని పూర్తి చేసి ఎన్ఎంసీ సభ్యులకు చూపించాల్సి ఉంది. ఈ విధానాన్ని పర్యవేక్షించడానికి ఇన్‌చార్జ్ డీఎంఈతోపాటు ఎన్ఎంసీ కోఆర్డినేటర్ జిల్లాకు వచ్చారు. మొదట కళాశాలలో ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం, అటెండెన్స్‌ను పరిశీలించారు. ఆ తర్వాత జనరల్ ఆస్పత్రిలో జరుగుతున్న పనితీరును పర్యవేక్షించారు. అలాగే అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకిషన్, డాక్టర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

- మూడు తులాల బంగారం
- రూ.48 వేల నగదు అపహరణ



తెరిచి ఉంచిన బీరువా

మహమ్మదాబాద్: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ముకర్లాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ముకర్లాబాద్‌కి చెందిన వడ్డేలాలయ్య సోమవారం ఇంటికి తాళం వేసుకుని సొంత పనిమీద మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. పిల్లలు పాఠశాలకు వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోకి చొరబడిన దుండగులు మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.48 వేల నగదు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి భోజనానికి వచ్చిన పిల్లలు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, గమనించి పక్కింటి వారికి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తాము లేకున్నా ఇల్లు తెరిచారని, బీరువా తాళాలు విరగిట్టి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టులో మంగళవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటూ ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో గోవా నుంచి తీసుకొచ్చిన 19 బాటిల్స్ మద్యం లభించిందని ఎక్సైజ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయాణికులు గోవా నుంచి మద్యం తెలంగాణ రాష్ట్రంలోకి తీసుకొస్తే వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎస్ఐ నర్సిరెడ్డి, వాహిద్, సిబ్బంది ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోవా మద్యం పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడిపర్తి గుట్టల్లో కలకలం

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి సమీపంలో గుట్టల్లో మృతదేహం ఉందంటూ మంగళవారం కలకలం రేగింది. దీంతో ఒక్కసారిగా తాడిపర్తి గ్రామం ఉలిక్కిపడింది. విషయం తెలుసుకున్న గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తాడిపర్తి గ్రామ సమీపంలోని గుట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. నాలుగు రోజులుగా గ్రామానికి సమీపంలోని గుట్టల్లో ఏదో వాసన వస్తుందని సమాచారం రావడంతో తాడిపర్తి వెళ్లి పరిశీలించామని చెప్పారు. గుట్ట మధ్యలో పాము చనిపోయి మురిగిపోయిందని అదే వాసన వచ్చిందని చెప్పారు. ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు, 100కు కాల్ చేసి చెప్పాలని సూచించినట్లు తెలియజేశారు.

తెలంగాణ మామిడికి విదేశాల్లోనూ డిమాండ్

వనపర్తి: తెలంగాణ మామిడి పండ్ల రకాలకు విదేశాల్లోనూ భలే డిమాండ్ ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అమెరికా ఫ్లోరిడాలోని టంపాలో ఉన్న ఎన్ఆర్ఐ డా. శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విదేశాల్లో స్థిరపడినా మాతృభూమిపై మమకారంతో వ్యవసాయాన్ని కొనసాగించడంతో పాటు ఆసక్తితో కొల్లాపూర్ మామిడి రకాలను సాగుచేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత మారిన వ్యవసాయ ముఖచిత్రం తదితర వివరాలను మంత్రి ఎన్ఆర్ఐలకు వివరించారు.



మామిడి కాయలను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పాఠశాలలో విద్యార్థికి విద్యుదాఘాతం

- తీవ్ర గాయాలకు గురికావడంతో ఆస్పత్రిలో చికిత్స

కొత్తకోట: పాఠశాల ఆవరణలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదవశాత్తు ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమందడి మండలం జగత్‌పల్లికి చెందిన యుగంధర్ పట్టణ సమీపంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుకుంటున్నాడు. మెడిటేషన్ క్లాస్ ఉండటంతో డ్రస్ మార్చుకునేందుకు వెళ్దామనుకున్నాడు. ఈ క్రమంలో బ్యాగ్‌ను కిటికీ పక్కన ఉంచడంతో అనుకోకుండా బ్యాగ్ కింద పడింది. బ్యాగ్ తీసుకునే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాద సంఘటనను చూసిన ఉపాధ్యాయులు వెంటనే స్పందించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సంఘట స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు చీర్లనాగన్న సాగర్, ప్రశాంత్, రాములుయాదవ్, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మన్యంయాదవ్ తదితరులు పరిశీలించారు.

స్కూల్ స్వీపర్లను రెగ్యులర్ చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేసే దాక పోరాటం చేస్తామని స్కూల్ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న అన్నారు. తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో మహబూబ్‌నగర్‌లోని ధర్నాచౌక్‌లో స్వీపర్లు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం 9వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ చూపడం లేదని విమర్శించారు. కొంత మందికి రూ.1,623, మరికొంత మందికి రూ.4 వేలు మాత్రమే వేతనాలు ఇస్తూ తమలోని ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. కనీస వేతనం కింద ప్రతి నెలా రూ.27 వేలు ఇవ్వాలని, స్వీపర్లు అందరినీ ఫుట్‌టైం స్వీపర్లుగా గుర్తించాలని, చనిపోయిన వారి స్థానంలో వారసులకు ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.15 లక్షలు చెల్లించాలని, అన్ని స్కూళ్లలో స్వీపర్ల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్ల సంఘం నాయకులు బాలగౌడ్, వెంకట్, జయమ్మ, బచ్చన్న, ఎల్లన్న, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న స్కూల్ స్వీపర్లు

కుమారుడితో సహా మహిళ అదృశ్యం



రేణుక

బల్మూర్: కుమారుడితో పాటు మహిళ అదృశ్యమైన సంఘటన బల్మూర్ మండలం మంగళకుంటపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రొడ్డ రేణుక, ఏడాది కుమారుడితో 45 రోజుల కిందట అదృశ్యమైంది. భర్త జ్ఞానేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు బంధువులు, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం బల్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లు 8712657736, 8712657731కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం

సింగరేణి సీఎండీ ఎన్‌.శ్రీధర్

గోదావరిఖని: వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రానున్న మూడునెలలే కీలకమని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్‌.శ్రీధర్ తెలిపారు. మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 75 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకోవాల్సి ఉంటుందని, వర్షాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తి కుంటుపడకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రోజుకు 2లక్షల టన్నులు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వర్షాలు కురిసినా ఓసీపీల్లో నీటినిల్వలు పెరగకుండా చూడాలని, ఇందుకు భారీ పంపులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా హాల్ రోడ్లను పటిష్టం చేయాలన్నారు. వర్షాకాలంలో భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఉండదని, ఎక్కువ ఉత్పత్తిపై కృషి చేయాలని తెలిపారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నుంచి రోజుకు సగటున 7 వేల టన్నులు తగ్గకుండా ఉత్పత్తి చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో రోజుకు సగటున కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలన్నారు.

ఈ నెలలో ఏరియాలవారీగా లక్ష్యాలివే..

● కొత్తగూడెం ఏరియాలో రోజుకు 41 వేల టన్నులు ● మణుగూరులో 40 వేల టన్నులు ● ఆర్జీ–2లో 24 వేల టన్నులు ● శ్రీరాంపూర్ ఏరియాలో 19 వేల టన్నులు ● ఆర్జీ–3లో 14,500 టన్నులు ● బెల్లంపల్లి ఏరియాలో 14 వేల టన్నులు ● మందమర్రి నుంచి 12 వేల టన్నులు ● ఆర్జీ–1 నుంచి 11,500 టన్నులు ● భూపాలపల్లి నుంచి 10 వేల టన్నులు ● ఇల్లందు ఏరియా నుంచి 9వేల టన్నుల చొప్పున సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రావమ్మా మహాలక్ష్మి..



ఏపీలో పెరుగుతున్న అమ్మాయిల సంఖ్య

- వెయ్యి మంది అబ్బాయిలకు 1,046 మంది అమ్మాయిల జననం
- దేశంలో కేరళ తర్వాత ఏపీలోనే అమ్మాయిలు అధికం
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అబ్బాయిలే అధికంగా ఉంటున్నారు. కానీ.. 2021 తర్వాత అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న ట్టు కేంద్ర గ ణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. శ్రామిక శక్తికి (లేబర్ ఫోర్స్) సంబంధించి 2021– 22 నివేదిక లో ఈ విషయాలను వెల్లడించింది. గతంలో వెయ్యి మంది అబ్బాయిలకు 977 మంది అమ్మాయిలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 1,046కు పెరిగినట్టు నివేదికలో వెల్లడించింది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాలు బాగా అమలు చేస్తుండటం వల్లే అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా ఆరే ళ్లు నిండకముందే బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి మృతి చెందేవారు. కానీ.. ఈ పరిస్థితులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా యాంటీనేటల్ చెకప్, వ్యాధి నిరోధక టీకాల అమలు అద్భుతంగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల స్థాయిలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. అమ్మాయిల సంఖ్య పెరగడానికి ఇవి కూడా కారణాలని నివేదిక వెల్లడించింది.

కేరళ తర్వాత ఏపీలోనే అధికం

దేశంలో అమ్మాయిలు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండటం గమనార్హం. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,114 మంది అమ్మాయిలు నమోదవుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,046 మంది నమోదయ్యారు. అత్యల్పంగా హర్యానాలో 887 మంది అమ్మాయిలు మాత్రమే నమోదయ్యారు. ఏపీలో పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,063 మంది, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,038 మంది అమ్మాయిలు ఉన్నట్టు నివేదికలో వెల్లడైంది. 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఇండియాలో సగటున ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 968 మంది అమ్మాయిలు నమోదయ్యారు.



వివిధ రాష్ట్రాల్లో వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

రాష్ట్రం	కేరళ	ఆంధ్రప్రదేశ్	హిమాచల్‌ప్రదేశ్	తమిళనాడు	ఛత్తీస్‌గఢ్	జార్ఖండ్	కర్ణాటక	ఒడిశా	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
అమ్మాయిలు	1,114	1,046	1,031	1,026	1,016	1,001	991	988	971	955

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/కారంచేడు : బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. సంస్థాగతంగా పలు రాష్ట్రాల్లో చేసిన మార్పుల్లో భాగంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా బీజేపీ నియమించింది. ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ టీడీపీకి దగ్గరవుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పురందేశ్వరి నియామకం రాజకీయవర్గాల్లో చర్చకు దారి తీసింది. మార్చి 2004లో పురందేశ్వరి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం కాంగ్రెస్ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేసి సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడుపై గెలుపొందారు. 2006లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచే విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా 2013 వరకు పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి రాజాంపేటలో పోటీ చేసి ఓడిపోయారు. ఆరున్నరేళ్ల నిరీక్షణ తర్వాత 2020 సెప్టెంబర్ 26న పురందేశ్వరిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీజేపీ అధిష్టానం నియమించింది. 2020 నవంబర్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆమెకు బాధ్యతలు అప్పగించింది. ఏపీలో పార్టీ బలోపేతానికి కీలకంగా వ్యవహరిస్తారని, ఎన్టీఆర్ ఛరిష్మాతో టీడీపీ నాయకులను బీజేపీలో చేర్పించడంలో ముందుంటారని అధిష్టానం భావించింది. కానీ రాష్ట్ర వ్యవహారల్లో అధిష్టానం అంచనాలను పురందేశ్వరి అందుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. దీంతో ఆమెకు ఒడిశా బాధ్యతల్లో కోత విధించింది. 2022 సెప్టెంబర్ 9న ఛత్తీస్‌ఘడ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కూడా పురందేశ్వరిని తప్పించింది. అప్పటి నుంచి ఆమె కేవలం జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలోనే ఉన్నారు. ఏపీలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సోము వీర్రాజుపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్టీఆర్ ఛరిష్మాను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే భావనతో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మాజీ ఎంపీ మాగుంట హత్య కేసులో... దోషికి బెయిల్

- నెలపాటు విడుదలకు హైకోర్టు ఆదేశం.. ఆ తర్వాత లొంగిపోవాలని స్పష్టీకరణ
- 2 దశాబ్దాలకుపైగా కారాగారంలోనే మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో దోషి, మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్‌ను నెలపాటు మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఆగస్టు 4న జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని ఆయనుకు స్పష్టం చేసింది. 1995లో జరిగిన ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో పీబీవీ గణేశ్‌ను 2000 సంవత్సరంలో కోర్టు దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన అప్పీల్‌కు వెళ్లినా ఉపశమనం కలగలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా జైల్లో ఉంటున్న గణేశ్‌ను సత్ప్రవర్తనగల ఖైదీగా పరిగణించి విడుదల చేయాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసులో సీబీఐ ఇంకొందరిపై దర్యాప్తు కొనసాగిస్తోందంటూ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ భార్య జోషి మాధవి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సత్ప్రవర్తన నిబంధనలన్నీ గణేశ్‌కు వర్తిస్తే ఆయన్ను వారంలో విడుదల చేయాలని 2022 సెప్టెంబర్‌లో ఆదేశించారు. కానీ నెలలు గడిచినా కేంద్రం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఏప్రిల్‌లో మాధవి అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తన భర్తకు బెయిల్ ఇవ్వాలని మధ్యంతర అప్లికేషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదిస్తూ సీబీఐ పరిధిలోని కేసు కనుక గణేశ్ విడుదలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ సీబీఐ విచారణ జరిపిన కేసు అయినా సరే.. ఒకసారి శిక్ష పడిన తర్వాత దోషి విడుదల రాష్ట్ర సర్కార్‌కు సంబంధించిన అంశం అవుతుందన్నారు. చట్టప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనను తిరస్కరించే అధికారం కేంద్రానికి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి దోషిని నెల రోజుల కోసం బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించారు.

వెన్నుపోటు వీరుడు.. ప్యాకేజీ శూరుడు!

''ఇవాళ వీళ్ల పరిస్థితి ఏమిటంటే.. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేనాయన ఓ నాయకుడు! ఎవరైనా తైలం పోస్తే కానీ గ్లాసు నిండని వ్యక్తి మరో నాయకుడు! ఒకరు వెన్నుపోటు వీరుడు, మరొకరు ప్యాకేజీ శూరుడు! వీరిద్దరికీ పేదల బతుకుల గురించి, ప్రజల కష్టాల గురించి, మాటిస్తే ఆ మాట మీద నిలబడాల్సిన అవసరం గురించి, ఒక మాటకున్న విలువ గురించిగానీ ఏమాత్రం తెలియదు. అలా బతకాలన్న ఆలోచనా లేదు. ఇద్దరూ కలసి ప్రజల్ని మోసం చేస్తూ 2014–19 మధ్య రాష్ట్రాన్ని ఏలారు. ఇద్దరూ కలసి రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలు, సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచారు''

ఓ నీతిమాలిన నాయకుడి కథ..

''ఇవాళ మనం తెరిపిస్తున్న చిత్తూరు డెయిరీ కథ ఎలాంటిదంటే.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ఓ మనిషి తాను స్థాపించిన డెయిరీ కోసం, సొంత లాభం కోసం, సొంత జిల్లా రైతునైనా, పిల్లనిచ్చిన మామనైనా బలి పెట్టేస్తాడని చెప్పే మనిషి కథ ఇది! ఓ నీతిమాలిన రాజకీయ నాయకుడి కథ ఇదీ! ఒక గొప్ప మెడికల్ కాలేజీ మన చిత్తూరుకు వస్తుంటే అడ్డుకున్నది సాక్షాత్తూ ఈ చంద్రబాబునాయుడు, గజదొంగల ముఠా సభ్యుడైన ఈనాడు రామోజీరావు వియ్యంకుడే. స్థలాలివ్వకుండా ఈ గడ్డకు మంచి మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్న చరిత్ర వారిదే. వేలూరు మెడికల్ కాలేజీకి జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్దుతూ ఈరోజు అడుగులు ముందుకు వేస్తున్నా''

– చిత్తూరు బహిరంగ సభలో సీఎం జగన్

'చిత్తూరు'కు క్షీరాభిషేకం!

- దశాబ్దాల చరిత్ర కలిగిన అతిపెద్ద డెయిరీకి ప్రాణ ప్రతిష్ట
- చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి: గత పాలకుల స్వార్థంతో రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

రూ.150 కోట్లతో తొలిదశ పనులు

ఇలాంటి మంచి కార్యక్రమంలో భాగంగా రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడే దశలవారీగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, ఛీజ్, పనీర్, యోగర్ట్, స్వీట్ తయారవుతాయి. ఐదు నుంచి ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి డెయిరీ చేరుకుంటుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. మరో 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చిత్తూరు జిల్లానే కాకుండా రాయలసీమకు చెందిన పాడి రైతన్నలు, అక్కచెల్లెమ్మలకు మంచి పాల సేకరణ ధర లభిస్తుంది.

జాతీయ రహదారి పనులు ప్రారంభించండి




కొల్లాపూర్: నేషనల్ హైవే 167కే పనులు వెంటనే ప్రారంభించాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు జాతీయ రహదారుల శాఖ రీజినల్ అధికారి కుష్వాను కోరారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో కుష్వాను కలిశారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్రం నిధులు కేటాయించి, టెండర్లు సైతం పూర్తిచేసి, ప్రధాని శంకుస్థాపన చేసినా కూడా స్థానికంగా పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతోనే పనుల ప్రారంభంలో ఆలస్యం జరుగుతోందని కుష్వా వెల్లడించినట్లు సమాచారం. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని పనులను వెంటనే చేపట్టాలని కుష్వాను కోరినట్లు సుధాకర్‌రావు వెల్లడించారు.

రామన్‌పాడులో 1,016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం నీటిమట్టం 1,016 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ ద్వారా విడుదల చేసే నీటిని ఆపేశారు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ తెలిపారు.

ఆర్టీసీ ప్రగతి చక్రం వార్షిక పురస్కారాలు

- రాష్ట్రంలోనే ఉత్తమ డిపోల ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్
- నష్టాలను అధిగమించి లాభాల బాటలోకి..
- ఎండీ చేతులమీదుగా రూ.3 లక్షల రివార్డు అందుకున్న డీఎం
- పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులకు పురస్కారాలు



మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు రూ.3 లక్షల రివార్డు అందజేస్తున్న సజ్జనార్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: టీఎస్‌ఆర్టీసీ సంస్థలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో మంగళవారం 'ఆర్టీసీ ప్రగతి చక్రం వార్షిక పురస్కారాలు' అందజేశారు. ఈ మేరకు ఆర్టీసీ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఉద్యోగులను శాలువాలతో సన్మానం చేసి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఇతర ఉద్యోగులకు పురస్కారాలు..

సేఫ్టీ వార్డెన్స్‌లో డి.శాంతయ్య (నాగర్‌కర్నూల్ డిపో), ఉత్తమ టీఐగా ఎం.కృష్ణయ్య టీఐ–3 (వనపర్తి డిపో), సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎస్‌ఎస్‌ఆర్ ప్రసాద్ (ఆర్‌ఎం కార్యాలయం), సంక్రాంతి చాలెంజ్ విభాగంలో ఉత్తమ కండక్టర్లు, డ్రైవర్లు ఎస్.మాధవి, బి.కిష్టయ్య (అచ్చంపేట), జె.శ్యాం, కె.రాజు (గద్వాల), పి.శ్రీమతి, కె.మల్లయ్య (కల్వకుర్తి), మహేశ్వర్‌రెడ్డి., జీపీరెడ్డి (కొల్లాపూర్), జి.మల్లయ్య, వసురాం (కోస్గి), మాణిక్‌రావు, రాందాస్ (మహబూబ్‌నగర్), జగన్‌మోహన్, ఎ.ఆంజనేయులు (నాగర్‌కర్నూల్), భీమమ్మ, ఎ.ప్రవీణ్ కుమార్ (నారాయణపేట), ఎల్‌కే.రెడ్డి, ఎం.మహేష్ (షాద్‌నగర్), జీఆర్.రెడ్డి, ఎండీ ఖాలెద్ (వనపర్తి), దసరా చాలెంజ్‌లో కండక్టర్లు, డ్రైవర్లు బాబాషరీఫ్, జి.అంజయ్య (అచ్చంపేట), కె.రత్నప్రభ, క్రిష్టారెడ్డి (గద్వాల), కె.మంజుల, జి.శ్రీనాథ్ (కల్వకుర్తి), కె.వెంకటస్వామి, రాములు (కొల్లాపూర్), మహేందర్, బాబు (కోస్గి), కె.శ్రీనివాసాచారి, ఎం.వసంతరెడ్డి (మహబూబ్‌నగర్), ఎంఎస్.రెడ్డి, పి.గోవర్ధన్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), ఎం.సరోజ, లింగారెడ్డి (నారాయణపేట), డి.నర్సింహులు, పి.వెంకటయ్య (షాద్‌నగర్), వీబీ.రాజు, కొండారెడ్డి (వనపర్తి)లు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. దసరా స్పెషల్ ఆపరేషన్ కేటగిరీలో డిపో మేనేజర్లు శ్రీనివాస్ (గద్వాల), ఆంజనేయులు (నారాయణపేట), ఉష (షాద్‌నగర్), ధరంసింగ్ (నాగర్‌కర్నూల్), రాజశేఖర్ (అచ్చంపేట), శ్రీకాంత్ (కల్వకుర్తి), రాజేశ్వర్ (కొల్లాపూర్), పరమేశ్వరి (వనపర్తి) పురస్కారాలు అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు, డీఎంలను రీజినల్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎంలు శ్యామల, బాబునాయక్ అభినందించారు.

ప్రథమస్థానంలో మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నష్టాల నుంచి లాభాల్లో వచ్చింది. నష్టాలను తగ్గించి లాభాల్లో రావడంపై రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. గతేడాది మార్చి వరకు రూ.22 కోట్ల నష్టాల్లో ఉన్న మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో ఈ ఏడాది మార్చి వరకు నష్టాలను అధిగమించి రూ.2 కోట్లు లాభాలు వచ్చినందుకు ఉత్తమ డిపోల్లో మహబూబ్‌నగర్ ప్రథమ స్థానంలో నిలిచింది. డిపో పరిధిలోని అన్ని ప్రధాన రూట్లలో బస్సులు నడిపించడంతోపాటు హైదరాబాద్ రూట్లో అధిక బస్సులు నడపడంతో డిపో ఆదాయంలో పురోగతి సాధించి లాభాల బాటలో పయనిస్తుంది. ఈ మేరకు డిపో మేనేజర్ సుజాతను మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ శాలువాతో సత్కరించి రూ.3లక్షల రివార్డును అందజేశారు. అలాగే రీజినల్ మేనేజర్ శ్రీదేవిని శాలువాతో సత్కరించారు.

ఆలోచింపజేసిన 'సాక్షి' కథనం

సమస్యను అధిగమించేందుకు పూర్వ విద్యార్థుల సమాయత్తం

సాక్షి ఎఫెక్ట్..


సర్కారు బడికి డిమాండ్

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యను అధిగమించేందుకు పూర్వ విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. మంగళవారం 'సాక్షి'లో 'సర్కారు బడికి డిమాండ్' అనే శీర్షికన ప్రచురితమైన సమగ్ర వార్తా కథనానికి స్థానికంగానే కాకుండా రాష్ట్ర స్థాయిలోనే చర్చ జరిగినట్లు పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. పాఠశాలలో నెలకొన్న తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరతపై సమగ్ర వార్తా కథనాన్ని ప్రచురితం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆ వార్తను చదివిన కొందరు పూర్వ విద్యార్థులు ఆలోచంపజేసేలా చేయడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డితో మాట్లాడినట్లు సమాచారం. ఐదు తాత్కాలిక గదులను నిర్మించి ఇస్తే తాను.. మండల విద్యాధికారి సురేష్ కలిసి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను తీసుకొచ్చేలా కలెక్టర్ వల్లూరు క్రాంతితో మాట్లాడి విద్యకు ఆటంకం కలుగకుండా చూస్తామని హెచ్‌ఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. శాశ్వత ప్రాతిపదికన కాకుండా తాత్కాలిక గదులను(రేకుల షెడ్డు మాదిరి) వేసేందుకు ముందుకు వస్తే మరో 200 మంది విద్యార్థులు చేరినా.. ఇబ్బంది లేకుండా చదువును కొనసాగించేందుకు తాను కృషి చేస్తానని పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఆర్థికంగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు రెండు, మూడు బ్యాచ్‌లకు సంబంధించిన పెద్దలు సంభాషించిన విధానాన్ని బట్టి చూస్తే.. త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. కాకపోతే రాజకీయ కోణంలో కాకుండా పూర్వ విద్యార్థులమనే భావనతో ముందుకు వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బీఐ క్విజ్ పోటీల్లో ఎన్మన్‌గండ్ల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఆర్బీఐ అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటిరసీ అనే అంశంలో భాగంగా సైబర్ నేరాలపై నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో నవాబుపేట మండలంలోని ఎన్మన్‌గండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఈ మేరకు మహబూబ్ నగర్‌లోని ఎస్‌బీఐ ఆర్సీటీలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తగరతి విద్యార్థి శ్రీశైలం, 9వ తరగతి విద్యార్థి హారిక మొదటి స్థానంలో నిలవగా వారికి రూ.10 వేల నగదు బహుమతిని ఆర్బీఐ అధికారులు అందజేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం దశరత్‌నాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ హన్మంతు, ఉపాధ్యాయులు వెంకటేష్ తదితరులు అభినందించారు.

ఎన్‌హెచ్‌–44పై ట్రాఫిక్ జాం

- ప్రమాదవశాత్తు పొట్టు లారీ బోల్తా
- మరోవైపు వరుసగా ఢీకొట్టుకున్న వాహనాలు
- నలుగురికి తీవ్రగాయాలు.. ఇరువైపులా భారీగా నిలిచిన రాకపోకలు



మాచారం వద్ద పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన టిప్పర్, టిప్పర్‌ను ఢీకొట్టిన కారు

జడ్చర్ల: జాతీయ రహదారి–44పై ఇరువైపులా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని మాచారం వద్ద జాతీయ రహదారిపై జడ్చర్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు పొట్టు లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మరోవైపు వన్ వేలో వాహనాలు రాకపోకలు సాగించాయి. ఇదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ పాల ట్యాంకర్, జడ్చర్ల వైపు వస్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆ వెంటనే వస్తున్న ఓ కారు సైతం ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురితోపాటు లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో క్షతగాత్రులను 108లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

స్తంభించిన రాకపోకలు..

జాతీయ రహదారిపై ఓ వైపు పొట్టు లారీ బోల్తా పడటం, మరోవైపు దారిలో వాహనాలు ఢీకొనడంతో వాహనాల రాకపోకలు భారీగా నిలిచిపోయాయి. అటు ఇటుగా దాదాపు 10 కిలోమీటర్లకు పైగా వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం కావడంతో పిల్లలకు పాలు, టిఫిన్స్ కావాల్సి ఉండటం, ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో కాలినడకన సమీపంలోని హోటళ్లు, దాబాలకు చేరుకుని ఆకలి తీర్చుకున్నారు. జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సుమారు 4 గంటలపాటు శ్రమించి ప్రమాదాలకు గురైన వాహనాలను క్రేన్ సాయంతో తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. ఆయా ప్రమాదాలకు కారణమైన లారీ డ్రైవర్ జితేందర్‌రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



గాయపడిన మహిళను అంబులెన్స్ దగ్గరికి తీసుకెళ్తున్న ప్రయాణికులు



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

ఇసుక డంపులు స్వాధీనం

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం మద్దూర్‌లో కొందరు అక్రమార్కులు అక్రమంగా 25 ట్రాక్టర్ల ఇసుకను తరలించి గ్రామ సమీపంలోని వెంకట్ రెడ్డి వ్యవసాయ పొలం సమీపంలో రోడ్డు పక్కన, దామోదర్ పొలంలోని రేకుల షెడ్ పక్కన డంపులు చేశారు. ఆ అక్రమ ఇసుక డంపులను మంగళవారం తహసీల్దార్ సువర్ణరాజు, ఆర్‌ఐ తిరుపతయ్య స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుకను తరలించుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సువర్ణరాజు మాట్లాడారు. ఎవరైన అక్రమ ఇసుక తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మద్దూర్‌లో ఇసుక డంపులు స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ సువర్ణరాజు, ఆర్‌ఐ తిరుపతయ్య